క్లుప్తంగా

ప్రజా సమస్యలను పరిష్కరించాలి


ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కమిషనర్ మనోజ్‌రెడ్డి

కడప కార్పొరేషన్: ప్రజా సమస్యలను న్యాయ పద్ధతిలో పరిష్కరించాలని నగరపాలక కమిషనర్ మనోజ్‌రెడ్డి అన్నారు. సోమవారం కార్పొరేషన్ కార్యాలయంలోని వీసీ హాలులో నిర్వహించిన 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' కార్యక్రమంలో ఆయన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రతి సమస్యను క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలించి పరిష్కరించాలన్నారు. ఇందులో మొత్తం 27 అర్జీలు రాగా, ఇంజినీరింగ్ విభాగం అర్జీలు–12, టౌన్‌ప్లానింగ్–3, పబ్లిక్ హెల్త్–4, రెవెన్యూ–6, యూపీఏ విభాగం అర్జీలు 2 వచ్చాయి. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ కే రాకేష్ చంద్రం, సిటీ ప్లానర్ రమణ, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ చంద్రశేఖర్, ఎస్ఈ చెన్నకేశవరెడ్డి, రెవెన్యూ, టౌన్ ప్లానింగ్ అధికారులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం


రక్తదాతను అభినందిస్తున్న బ్యాంకు అధికారులు

కడప కల్చరల్ : కడప నగరంలోని యుకో బ్యాంకు 83వ వ్యవస్థాపక దినోత్సవ సందర్భంగా సోమవారం రిమ్స్ బృందం సహకారంతో సంస్థ నగర కార్యాలయంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ముఖ్య అతిథిగా అసిస్టెంట్ ప్రొఫెసర్ రాజేంద్రప్రసాద్, వైద్యులు సంధ్య పాల్గొని రక్తదాన ఆవశ్యకతను వివరించారు. అవకాశం ఉన్నయువత రక్తదానం చేసేందుకు ముందుకురావాలని సూచించారు. బ్యాంకు మేనేజర్ ఓబులేశు మాట్లాడుతూ బ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఖాతాదారులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బ్యాంకు అసిస్టెంట్ మేనేజర్ నూర్‌బాష, విశ్వనాథరెడ్డి, గణేష్ రెడ్డి, మహేష్, సోని, బిందు, మెప్మా సిబ్బంది, సీఓ ఆదినారాయణ, నాగన్న, విజయలక్ష్మి రాధ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా క్రీడాకారులకు పతకాలు


క్రీడాకారులను అభినందిస్తున్న కోచ్

కడప స్పోర్ట్స్: చత్తీస్‌ఘర్ రాజధాని రాయపూర్‌లో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన 58వ జాతీయ స్థాయి పోటీల్లో వైఎస్‌ఆర్ కడప జిల్లాకు చెందిన క్రీడాకారులు పతకాలు సాధించారు. ×కురాష్‌ె క్రీడాంశంలో అండర్–17 బాలుర 73 కేజీల విభాగంలో బి. శశాంక్ (కేఆర్ఆర్ఎం హైస్కూల్, కడప) రజత పతకం సాధించాడు. అండర్–19 బాలుర 60 కేజీల విభాగంలో నవాజ్ ఉర్ రెహమాన్ (శ్రీనలంద హైస్కూల్, సిద్దవటం) కాంస్యపతకం సాధించాడు. జిల్లా క్రీడాకారులు జాతీయస్థాయిలో పతకాలు సాధించడం పట్ల ఎస్‌జీఎఫ్ అండర్–19 జిల్లా కార్యదర్శి సి. శారద, కోచ్ కొన్నిపాటి వెంకటేష్, విశ్రాంత ఫిజికల్ డైరెక్టర్ సుబ్బరాజు అభినందనలు తెలిపారు.

సత్కారం


కన్యకుమారిని సత్కరిస్తున్న శ్రీనివాసులు తదితరులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఏపీఎస్ ఆర్టీసీ బద్వేలు డిపో మేనేజర్‌గా పనిచేస్తూ బదిలీపై కడపకు వచ్చి డిపో అసిస్టెంట్ మేనేజర్‌గా బాధ్యతలు స్వీకరించిన కన్యాకుమారిని నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ నాయకులు స్వాగతం పలికి సత్కరించారు. ఈ కార్యక్రమంలో నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ డిపో కార్యదర్శి సగినాల శ్రీనివాసులు, సూపర్ అసోసియేషన్ ప్రతినిధులు లలిత, మంజుల, నాగమణి, లలిత పాల్గొన్నారు.

కడప తహసీల్దార్‌పై ఫిర్యాదు

కడప కార్పొరేషన్: కడప తహసీల్దార్ ఎంవీఎస్ నారాయణరెడ్డిపై 10వ డివిజన్ కార్పొరేటర్ ఎం. మల్లికార్జున జాతీయ బీసీ కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. తన డివిజన్ పరిధిలోని జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో ఈనెల 4వ తేదీదీ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన 'రెవెన్యూ సదస్సు'కు స్థానిక ప్రజాప్రతినిధినైన తనకు కనీస సమాచారం ఇవ్వలేదన్నారు. ప్రజల తరపున ఎన్నికై న తనను ఆహ్వానించకుండా అవమానించడం దారుణమన్నారు. రాజ్యాంగబద్ధంగా తనకు సక్రమించిన హక్కులకు భంగం కలిగించిన తహసీల్దార్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు.

డీఈఓపై చర్యలకు జాప్యమెందుకు..?

– ఆర్‌జేడీ కార్యాలయం ఎదుట ఏఐఎస్‌బీ, ఆర్ఎస్‌యూ సంఘాలు ఆందోళన


ఆర్‌జేడీ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న ఏఐఎస్‌బీ, ఆర్ఎస్‌యూ నాయకులు

కడప ఎడ్యుకేషన్: ఉపాధ్యాయులను వేధింపులకు గురిచేయడంతో పాటు కార్పొరేట్, ప్రయివేట్ విద్యాసంస్థలకు కొమ్ముకాస్తున్న కడప జిల్లా విద్యాశాఖ అధికారిపై చర్యలు తీసుకునేందుకు అధికారులు ఎందుకు జంకుతున్నారని అఖిల భారత విద్యార్థి బ్లాక్ (ఏఐఎస్‌బీ) జిల్లా కన్వీనర్ సగిలి రాజేంద్ర ప్రసాద్, రెవల్యూషనరి విద్యార్థి సంఘం (ఆర్ఎస్‌యూ) జిల్లా అధ్యక్షులు ప్రశాంత్‌లు అన్నారు. సోమవారం ఉదయం ఏ.ఐ.ఎస్.బి, ఆర్.ఎస్.యూ ఆధ్వర్యంలో జిల్లా విద్యాశాఖ అధికారిపై వస్తున్న ఆరోపణలపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కడపలోని పాఠశాల ఆర్‌జేడీ కార్యాలయం ముందు ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కడప జిల్లా విద్యాశాఖ అధికారిగా మీనాక్షి బాధ్యతలు తీసుకున్నప్పటి నుండి వివాదాస్పదంగా వ్యవహరిస్తూ ఉపాధ్యాయులను ఇష్టం వచ్చినట్లు అసభ్య పదజాలంతో దూషిస్తున్నారన్నారు. దీంతోపాటు సస్పెండ్ చెస్తానని బెదిరిస్తూ మానసికంగా వేధిస్తూ తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని.. ఇలా వ్యవహరించడం తగదన్నారు. ఎస్.ఎస్.ఏ లో అసిస్టెంట్ స్టాటికల్ ఆఫీసర్ గా పనిచేస్తున్న ఇలియాస్ ఖాన్‌ను డీఈఓ తిట్టడంతోనే ఆయన చనిపోయారనే ఆరోపణలపై అధికారులు ఎందుకు విచారణ జరపడం లేదని వారు ప్రశ్నించారు. జిల్లాలో అనుమతులు లేకున్నా ప్రయివేట్ విద్యాసంస్థలు 2025–26 విద్యాసంవత్సరానికి అడ్మిషన్స్ ప్రారంభించారని వాటిపై జిల్లా విద్యాశాఖ అధికారి ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని వారు ప్రశ్నించారు. జిల్లాలో కార్పొరేట్ ప్రయివేట్ విద్యాసంస్థలు టెక్నో, ఈ టెక్నో, ఒలంపియాడ్, కాన్సెప్ట్ వంటి పేర్లతో వేల రూపాయలు వసూలు చేస్తున్నా, సెలవు దినాలలో తరగతులు నిర్వహిస్తున్నా జిల్లా విద్యాశాఖ అధికారి ఎలాంటి చర్యలు తీసుకోకుండా వాటికి కొమ్ముకాస్తున్నారని ఆరోపించారు. జిల్లా విద్యాశాఖ అధికారిపై వస్తున్న ఆరోపణలపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏ.ఐ.ఎస్.బి, ఆర్.ఎస్.యూ నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

డీఈఓను ప్రభుత్వానికి సరెండర్ చేయాలి

కడప ఎడ్యుకేషన్: జిల్లా విద్యాశాఖ అధికారి మీనాక్షిని రాష్ట్ర ప్రభుత్వానికి సరెండర్ చేసేందుకు సిఫార్సు చేయాలని పాఠశాల విద్య ఆర్‌జేడీ శ్యాముల్‌ను పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంకన్న కోరారు. ఈ విషయమై ఆర్‌జేడీని సోమవారం కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి కడప జిల్లా చరిత్రలోనే డీఈఓకు వ్యతిరేకంగా 27 ఉపాధ్యాయ సంఘాలు ఆందోళన చేస్తున్నాయన్నారు. ఉన్నతాధికారులు చొరవ తీసుకుని వివాదాల డీఈఓను ప్రభుత్వానికి సరెండర్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ నగర నాయకుడు మనోజ్ పాల్గొన్నారు.

డీఈఓను విధుల నుంచి తొలగించాలి

– ఎమ్మెల్సీకి ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక వినతి


ఎమ్మెల్సీకి వినతి పత్రం సమర్పిస్తున్న ఉపాధ్యాయ సంఘ నాయకులు

కడప ఎడ్యుకేషన్: జిల్లా విద్యాశాఖ అధికారి వైఖరి, ఉపాధ్యాయులపై ఆమె మాట్లాడే దుర్భాషలపై చర్యలు తీసుకుని ఆమెను విధుల నుంచి తొలగించాలని ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం కడప ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ లో ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక నాయకులు ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డిని కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. ఎమ్మెల్సీని కలిసిన వారిలో ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక నాయకులు మోపూరి వెంకట శివారెడ్డి, రామమూర్తి, బాల గంగిరెడ్డి, ఇలియాస్ బాషా, ఖాదర్ బాషా, కొండారెడ్డి, లెక్కల జమాల్ రెడ్డి , రామాంజనేయరెడ్డి, అబ్దుల్లా, రామాంజనేయులు, రవి శంకర్, రామకృష్ణంరాజు, ఆంజనేయులు, నాగేశ్వర రావు, గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఎర్త్ సైన్స్ విభాగంలో ప్రతిభావంతులకు బంగారు పతకం

– తేళ్ల సుబ్బారావు, రవి కుమార్ స్మారకార్థం ఏర్పాటు


దాత డా. లక్ష్మీప్రసాద్‌ను అభినందిస్తున్న వీసీ, అధికారులు

వైవీయూ: యోగివేమన విశ్వ విద్యాలయం ఎర్త్ సైన్స్ విభాగంలో ప్రతిభావంతులైన విద్యార్థుల కోసం ×శ్రీ తేళ్ల సుబ్బారావు, శ్రీ తేళ్ల రవికుమార్ స్మారక బంగారు పతకం ఏర్పాటు చేశారు. ప్రకాశం జిల్లా చీరాల మండలానికి చెందిన టి. సుబ్బారావు భార్య పి. విశ్రాంతమ్మ, కుమారులు డా.టి. లక్ష్మీ ప్రసాద్ (వైవీయూ ఎర్త్ సైన్స్ సహ ఆచార్యులు), టి.నిర్మల్ కుమార్, టి. నాగరాజులు ఎర్త్ సైన్స్ విభాగంలో గోల్డ్ మెడల్ అందజేసేందుకు సంబంధించిన మెమోరాండం ఆఫ్ అగ్రిమెంట్ పత్రాలపై వైవీయూ వీసీ కె.కృష్ణారెడ్డి సమక్షంలో రిజిస్ట్రార్ ఆచార్య పుత్తా పద్మ సంతకాలు చేశారు. దాతలు విశ్వవిద్యాలయానికి రూ.1.25 లక్షల చెక్కును గోల్డ్ మెడల్ ఏర్పాటుకు శాశ్వత నిధుల కోసం అందజేస్తామన్నారు. ప్రకాశం జిల్లాలో హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్‌గా పనిచేసిన తేళ్ల సుబ్బారావు, ఏపీఎస్పీడీసీఎల్‌లో అసిస్టెంట్ ఇంజనీర్‌గా పనిచేసిన తేళ్ల రవికుమార్ జ్ఞాపకార్థం ఈ గోల్డ్ మెడల్ ఏర్పాటు చేశామని డా. లక్ష్మీ ప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్. రఘునాథరెడ్డి, సీఈ ఆచార్య కె.ఎ స్.వి. కృష్ణారావు, డీన్‌లు ఆచార్య ఏజీ దాము, ఆచార్య కంకణాల గంగయ్య, ఆచార్య వై. సుబ్బరాయుడు, భూగర్భశాస్త్ర విభాగాధిపతి వి. సునీత, ఆచార్య కె. రఘుబాబు, ఆచార్య ఎస్. జయరాజు, సహఆచార్యులు ఎస్. శ్రీనివాస్ గౌడ్, ప్రజా సంబంధాల విభాగం సంచాలకులు సరిత పాల్గొన్నారు.

పార్టీని పటిష్టం చేయాలి


వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్న తోటక్రిష్ణ

కడప కార్పొరేషన్: జిల్లాలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని పటిష్టం చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు పి. రవీంద్రనాథ్‌రెడ్డి సూచించారు. సోమవారం పార్టీ కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీగా నియమించబడిన తోటక్రిష్ణ ఆయన్ను కలిసి శాలువా కప్పి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా రవీంద్రనాథ్‌రెడ్డి మాట్లాడుతూ పార్టీ ఏ పిలుపు ఇచ్చినా ముందుండి పనిచేసేందుకు జిల్లా కమిటీ సభ్యులు సిద్ధంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి, కార్పొరేటర్ షఫీ, బంగారు నాగయ్య యాదవ్ పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీకి బలిజలను చేరువ చేస్తాం


దాసరి శివప్రసాద్‌ను సత్కరిస్తున్న బలిజ సంఘ నాయకులు

కడప కార్పొరేషన్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి బలిజ కులస్తులను చేరువ చేసేందుకు కృషి చేస్తానని ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు దాసరి శివప్రసాద్ అన్నారు. సోమవారం స్థానిక శారదా నిలయం హైస్కూల్ వద్ద వైఎస్సార్‌సీపీ రాష్ట్ర నాయకులు తుమ్మలకుంట శివశంకర్ ఆధ్వర్యంలో దాసరి శివతో కేక్ కట్ చేయించి, శాలువా కప్పి, పూల మాల వేసి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో బలిజ సంఘ నాకులు మారేళ్ల నాగముణి, భవన నిర్మాణ కార్మిక సంక్షేమ సంఘం అధ్యక్షులు వెంకటయ్య, వైఎస్‌ఆర్ సీపీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షులు సాయి దత్త, తదితరులు పాల్గొన్నారు.

అండర్–12 క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

తొలి రోజు కడప, చిత్తూరు జట్లకు విజయం


వైఎస్‌ఆర్‌ఆర్–ఏసీఏ మైదానంలో క్రికెట్ పోటీల్లో పాల్గొన్న కడప, అనంతపురం జట్లు

కడప స్పోర్ట్స్ : కడప వేదికగా ఏసీఏ సౌత్‌జోన్ విభాగం అంతర్ జిల్లాల అండర్–12 బాలుర విభాగం క్రికెట్ పోటీలు సోమవారం ప్రారంభమయ్యాయి. వైఎస్ రాజారెడ్డి–ఏసీఏ క్రికెట్ మైదానంలో కడప, అనంతపురం జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన కడప జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. 35 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 166 పరుగులు చేసింది. జట్టులోని తాహీర్ 54, విష్ణువర్ధన్‌రెడ్డి 45, మానస్ నందన్ 31 పరుగులు చేశారు. అనంతపురం బౌలర్లు లలిత్‌కిశోర్ 3, హేమచందర్‌నాయక్ 2 వికెట్లు తీశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన అనంతపురం జట్టు 29.2 ఓవర్లలో 135 పరుగులకే ఆలౌట్ అయింది. జట్టులోని హవిష్‌రెడ్డి 45, గణేష్ 20 పరుగులు చేశారు. కడప బౌలర్లు మోనిష్‌రెడ్డి 4, అబుబకర్ 2, షాహిద్ 2 వికెట్లు తీశారు. దీంతో కడప జట్టు 31 పరుగుల తేడాతో విజయం సాధించింది.

కర్నూలుపై చిత్తూరు విజయం

కేఓఆర్ఎం మైదానంలో నిర్వహించిన మరోమ్యాచ్‌లో కర్నూలు, చిత్తూరు జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన చిత్తూరు జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. నిర్ణీత 35 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 250 పరుగులు చేసింది. జట్టులోని ఎస్.ధనుష్ 94 బంతుల్లో 110 పరుగులు చేశాడు. ఈయనకు జతగా లిఖిత్ ఇరగం రెడ్డి 99 పరుగులు చేశాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన కర్నూలు జట్టు 22.2 ఓవర్లలో 85 పరుగులకే ఆలౌట్ అయింది. జట్టులోని లిఖిత్‌సాయి 3, గణేష్ 3 వికెట్లు తీశారు. దీంతో చిత్తూరు జట్టు 165 పరుగుల ఆధిక్యంతో విజయం సాధించింది.


ధనుష్, చిత్తూరు, 110 పరుగులు


లిఖిత్, చిత్తూరు, 99 పరుగులు


తాహీర్, కడప, 54 పరుగులు

రికార్డుల పరిశీలన


రికార్డులను పరిశీలిస్తున్న జడ్జి ఎస్. బాబా ఫక్రుద్దీన్

కడప అర్బన్: జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో సెక్రటరీ, జడ్జి ఎస్. బాబా ఫక్రుద్దీన్ ఆధ్వర్యంలో సోమవారం కడపలోని జిల్లా కోర్టులో న్యాయసేవా సదన్‌లో జిల్లా కమిటీతో ఖైదీల ఆరోగ్యం, వివిధ అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ పాత ఖైదీలు, తీవ్ర అనారోగ్యంతో వున్న ఖైదీల గురించి చర్చించారు. లీగల్ సర్వీసెస్ హెల్ప్‌లైన్ నెంబర్ 15100 మొదలగు అంశాలను వివరించారు. కడప కేంద్ర కారాగారంలో పురుషుల కారాగారం, ప్రత్యేక మహిళా కారాగారం, ప్రిజన్ లీగల్ ఎయిడ్ క్లినిక్‌లను సందర్శించి, తనిఖీ చేశారు. ఖైదీలతో మాట్లాడి, వారి ఆరోగ్య విషయాలను తెలుసుకున్నారు. అనంతరం జైలు పరిసరాలను, రిజిస్టర్‌లను పరిశీలించి సూచనలు ఇచ్చారు.

బహుమతుల ప్రదానం

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఆర్టీసీ కార్గో డోర్ డెలివరీ మాసోత్సవాన్ని పురస్కరించుకుని వినియోగదారులను ప్రోత్సహిస్తూ లక్కీడిప్ ద్వారా బహుమతులు అందజేస్తున్నామని జిల్లా ప్రజారవాణాధికారి గోపాల్‌రెడ్డి తెలిపారు. సోమవారం కార్గో డోర్ డెలివరీ వినియోగదారులకు డిప్ తీసి కొత్తాస్ ప్రాడెక్స్ వారి సహకారంతో రూ. 1000 విలువైన బహుమతులను అందజేశారు. ఈకార్యక్రమంలో డిప్యూటీ సీఎంఈ లక్ష్మిభాస్కర్, ఏటీఎం కమర్షియల్ జనార్దన్, కడప డిపో మేనేజర్ డిల్లీశ్వరరావు, ఆర్ఎంఈ రామంద్ర, డీఎంఈ గురుప్రసాద్‌రెడ్డి, కార్గో కాంట్రాక్టు సూపర్‌వైజర్ సురేంద్ర పాల్గొన్నారు.

ప్రతి రైతును ప్రకృతి వ్యవసాయం వైపు మళ్లించాలి


సమావేశంలో మాట్లాడుతున్న ప్రకృతి వ్యవసాయ డీపీఎం ప్రవీణ్‌కుమార్

కడప అగ్రికల్చర్: ప్రతి రైతును ప్రకృతి వ్యవసాయం వైపు మళ్లించేలా అవగాహన కల్పించాలని ప్రకృతి వ్యవసాయం డిస్ట్రిక్ ప్రాజెక్టు మేనేజర్ ప్రవీణ్‌కుమార్ పేర్కొన్నారు. సోమవారం కడపలోని ప్రకృతి వ్యవసాయ కార్యాలయ సమావేశ మందిరంతోపాటు జిల్లా సమాఖ్య టిటిడి హాల్‌లో రైతు సాధికార సంస్థ సౌజన్యంతో 36 మండలాల పరిధిలోని ప్రకృతి వ్యవసాయ సిబ్బందికి రెసిడెన్సియల్ శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా డీపీఎం ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ వాతావరణ కాలుష్యంతోపాటు మార్పుల కారణంగా అకాల వర్షాలు, ప్రకృతి వైపరీత్యాలు చోటు చేసుకుంటున్నాయన్నారు. వాటి ముప్పు నుంచి మానవ మనుగడను కాపాడేందుకు ప్రకృతి వ్యవసాయం వైపు రైతులు అడుగులు వేయాలన్నారు. పురుగు మందులు, రసాయనిక ఎరువుల వాడకం లేకుండా వ్యవసాయాన్ని నిర్వహించాలన్నారు. ఇందుకు రైతులకు అవగాహన పెంచాలన్నారు. ఈ దిశగా ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ప్రముఖపాత్ర పోషించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ నేచురల్ ఫామింగ్ అసోసియేట్(ఎన్ఎఫ్ఏ)లు శ్రీనాథ్‌రెడ్డి, మేరీ, నరసింహారెడ్డి, చంద్రమౌళీశ్వరెడ్డి, రాజకుమార్‌లతోపాటు ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ


మహిళా డిగ్రీ కళాశాలలో క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్, జీసీటీఏ ప్రతినిధులు


టీఎన్ఎస్ఎఫ్ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న వైవీయూ వీసీ, రిజిస్ట్రార్


నూతన సంవత్సర క్యాలెండర్ ను ఆవిష్కరిస్తున్న ఎన్జీఓ అసోసియేషన్ నేతలు

వైవీయూ: కడప నగరంలోని ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో గవర్నమెంట్ కాలేజ్ టీచర్స్ అసోసియేషన్ (జీసీటీఏ) ఆధ్వర్యంలో నూతన సంవత్సర క్యాలెండర్‌ను సోమవారం ఆవిష్కరించారు. కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డా. వి. సలీంబాషా క్యాలెండర్‌ను ఆవిష్కరించి, జీసీటీఏ నాయకులను అభినందించారు. ఈ సందర్భంగా జీసీటీఏ మహిళా కార్యదర్శి డా. సి.వి. కృష్ణవేణి మాట్లాడుతూ మహిళా అధ్యాపకుల సమస్యల పరిష్కారానికి జీసీటీఏ ఎల్లవేళలా కృషిచేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో జీసీటీఏ ప్రతినిధులు పాల్గొన్నారు.

టీఎన్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో..

టీఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో నూతన సంవత్సర క్యాలెండర్‌ను వైవీయూ వైస్ చాన్సలర్ ఆచార్య కె. కృష్ణారెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య పి. పద్మ సోమవారం ఆవిష్కరించారు. టీఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు బొజ్జా తిరుమలేష్ ఆధ్వర్యంలో వైవీయూలో క్యాలెండర్‌ను ఆవిష్కరించారు.

ఈ కార్యక్రమంలో టీఎన్ఎస్ఎఫ్ నాయకులు భరత్‌సింహ, అమృత్, ఉదయ్ తదితరుల పాల్గొన్నారు.

ఆర్జేయూపీ ఆధ్వర్యంలో..

కడప ఎడ్యుకేషన్: ఆర్జేయూపీ– 2025 నూతన సంవత్సర డైరీ, క్యాలెండర్‌ను పట్టభద్రుల ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి ఆవిష్కరించారు. ఆర్జేయూపీ రాష్ట్ర అధ్యక్షుడు డా.గునిశెట్టి శ్రీనివాసులు , కడప జిల్లా అధ్యక్ష ప్రధానకార్యదర్శులు ప్రసాదరావు, పుల్లయ్యలు, టీచర్స్ హోం అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు రాజగోపాల్, వెంకట సుబ్బయ్యలు, రాష్ట్ర మహిళా కార్యదర్శి అనసూయమ్మ, సీనియర్ నాయకులు వీరన్న, రాజశేఖర్ రెడ్డి, రవి, సుధాకర్, రాముడు తదితరులు పాల్గొన్నారు.

కడప రూరల్: ఏపీ ఎన్జీఓ జిల్లా అసోసియేషన్ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్ ను సోమవారం స్థానిక ఆ అసోసియేషన్ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులు మాట్లాడుతూ తమ హక్కుల సాధన కోసం ఉద్యోగులు ఐక్యంగా ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు వై ప్రసాద్ యాదవ్, జిల్లా కార్యదర్శి డి రవి కుమార్, కడప నగర అధ్యక్షులు కే చిన్నయ్య, శైలేశ్వర్ రెడ్డి, నాగార్జున, శ్రీనివాసన్, జానకి, అరుణ తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు అభినందన


విజేతలను అభినందిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు

వైవీయూ: కడప నగరంలోని ప్రభుత్వ పురుషుల కళాశాలలో జాతీయ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన జిల్లాస్థాయి పోటీల్లో విజేతలను కళాశాల ప్రిన్సిపాల్ డా. జి. రవీంద్రనాథ్ అభినందించారు. వ్యాసరచన, వక్తృత్వ విభాగాల్లో తెలుగు, ఇంగ్లీషు, ఉర్దూ మాధ్యమాల్లో నిర్వహించిన పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయస్థానాల్లో నిలిచిన విద్యార్థులు చిన్మయ, వెంకటసాయి, కిరణ్‌కుమార్, హీనా, నారాయణ, వీరేష్‌లను అభినందించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డా. ఎం. రమేష్, కామర్స్ అధ్యాపకులు డాక్టర్ ఆర్. నీలయ్య, డా. మధుసూదన, డా. అంకాల నాగరాజు, డా. కృష్ణవేణి, రెడ్డిబాషా, రాధిక, లావణ్య పాల్గొన్నారు.

నిత్యపూజయ్య ఉత్సవాలపై సమావేశం నిర్వహించాలి

కడప కల్చరల్ : జిల్లాలో ప్రముఖ శైవక్షేత్రమైన శ్రీ నిత్యపూజస్వామి కోనలో త్వరలో శివరాత్రి ఉత్సవాలు జరగనున్న సందర్భంగా జిల్లా అధికారులు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయాలని శ్రీ సుముఖి అన్నపూర్ణేశ్వరి సేవా సమితి అధ్యక్షులు సుబ్రమణ్యం, వెంకట కృష్ణయ్య, సభ్యులు నాగదాసరి మునికుమార్ కోరారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్‌కు ఈ మేరకు వారు అధికారులకు వినతిపత్రం సమర్పించారు. వారు మాట్లాడుతూ నిత్యపూజకోనలో ఆదాయం బాగానే ఉన్నా అది అభివృద్ధికి నోచుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఫిబ్రవరి 26న మహాశివరాత్రిని పురస్కరించుకుని ముందస్తుగా నిత్యపూజయ్యకోనపై అన్ని ప్రభుత్వశాఖల అధికారులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి పరిష్కార మార్గాలు కనుగొనాలని కోరారు. సంస్థ పక్షాన తమవంతుగా తాము తగిన సహకారం అందించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు.

వైవీయూ ఎదుట ఆందోళన


వైవీయూ ముఖద్వారం వద్ద నిరసన తెలుపుతున్న ఏబీవీపీ నాయకులు

వైవీయూ: యోగివేమన విశ్వవిద్యాలయం పరిధిలో తరగతులు నిర్వహించని బీఈడీ కళాశాలలపై చర్యలు చేపట్టాలంటూ ఏబీవీపీ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం వైవీయూ ముఖద్వారం వద్ద ఏబీవీపీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఏబీవీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కోడూరు మల్లికార్జున మాట్లాడుతూ వైవీయూ పరిధిలో పలు కళాశాలలు తరగతులు నిర్వహించకుండా, అసలు విద్యార్థులను క్లాస్‌లకే పిలిపించకుండా పరీక్షలు మాత్రం నిర్వహించి సర్టిఫికెట్లు అందజేస్తున్నారన్నారు. ఇందుకోసం అధిక మొత్తంలో ఫీజులు వసూలు చేస్తూ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. అనంతరం వైవీయూ వీసీ ఆచార్య కె. కృష్ణారెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏబీవీపీ జిల్లా కన్వీనర్ మాణిక్యరాజు, యూనివర్సిటీ అధ్యక్షుడు హనీష్ పాల్గొన్నారు.

వైవీయూ విద్యార్థికి ఓఎన్‌జీసీ స్కాలర్‌షిప్


విద్యార్థిని అభినందిస్తున్న వీసీ కృష్ణారెడ్డి

వైవీయూ: యోగివేమన విశ్వవిద్యాలయం జియాలజీ శాఖ విద్యార్థి కె. ఇమ్మాన్యుయేల్ కి ఆయిల్ అండ్ నాచురల్ గ్యాస్ కార్పొరేషన్ (ఓఎన్జీసీ) నుంచి మెరిట్ స్కాలర్ షిప్ మంజూరు అయ్యింది. ఓఎన్‌జీసీ మెరిట్ స్కాలర్ షిప్ కింద ఈ విద్యార్థికి ఉన్నత విద్య కొనసాగించేందుకు ఏడాదికి రూ. 50 వేలు ఇవ్వనున్నారు. పేద కుటుంబం నుంచి వచ్చిన ఈ విద్యార్థి డిగ్రీలో 8.9 జీపీఏ, పీజీ మొదటి రెండు సెమిస్టర్ లలో 9.0 జీపీఏ సాధించి ప్రతిభను చాటారు. ఈ ఉపకార వేతనానికి జాతీయ స్థాయిలో దాదాపు 2 వేల మంది దరఖాస్తు చేయగా ప్రతిభా ప్రాతిపదికన వైవీయూ క్యాంపస్ పీజీ కళాశాల జియాలజీ విద్యార్థి ఇమ్మాన్యుయేల్ ఎంపిక కావడం విశేషం. ఈ విద్యార్థిని వైవీయూ వీసీ ఆచార్య కె. కృష్ణారెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య పుత్తా పద్మ, ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్. రఘునాథరెడ్డి, భూగర్భశాస్త్ర విభాగాధిపతి ఆచార్య సునీత తదితరులు అభినందించారు.

నూతన కమిటీ ఎన్నిక


మాట్లాడుతున్న చంద్రశేఖర్

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: సీపీఎం జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నట్లు సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ పేర్కొన్నారు. సోమవారం నగరంలోని సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 4, 5వ తేదీలలో కడప నగరంలో జరిగిన సీపీఎం జిల్లా మహాసభలో నూతనంగా కమిటీని ఎన్నుకున్నామన్నారు. నూతన సీపీఎం జిల్లా కార్యదర్శిగా చంద్రశేఖర్, జిల్లా కమిటీ సభ్యులుగా ఏ.రామ్మోహన్, బి.మనోహర్, జి.శివకుమార్, వి.అన్వేష్, కే.సత్యనారాయణ, బి.ఆర్.రాజా, కే.శ్రీనివాస్ రెడ్డి, బి.దస్తగిరి రెడ్డి, కే.శ్రీను, బి.లక్ష్మీదేవి , బి.ఆర్. రాహుల్, పి.చాంద్ బాషా, ఎస్.గౌసియా బేగం తో పాటు పలువురి ఎన్నుకున్నామన్నారు.